
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
ఆదివారం 9 నవంబరు 2025
జిల్లాల వార్తలు



మద్యం మత్తులో తల్లిని చంపిన కొడుకు

రెండు నెలల పసికందును
ట్రాక్టర్ కింద పడేసిన తల్లి
మద్యం మత్తులో ఘాతుకం.. కాపాడిన గ్రామస్థులు

పాతూర్ సీడ్స్ కంపెనీపై కేసు

వార్తలు 7వ పేజీలో



ఇటాలియన్ ఆర్ట్‌డేకో శైలిలో నిర్మించిన దుబ్బాక దొర రాజా ఉమ్మారెడ్డి భవనం

సండే స్పెషల్
Sunday Special

భవన వైభవం

డంగు సున్నపు ఇళ్ల దర్పం

పల్లెవాకిళ్లలో ఆత్మీయత అల్లుకున్న పొదరిళ్లు

సంస్కృతికి అద్దం పట్టిన వారసత్వ లోగిళ్లు

పెళ్లి వారికి విడుదులు.. బంతి భోజనాల భవంతులు

ఆహ్లాదాన్ని పంచే అపురూపమైన పెంకుటిళ్లు

కాలంతో కనుమరుగవుతున్న ఆనవాళ్లు

డంగు సున్నంతో కట్టిన ఒకప్పటి ఇళ్లు... కేవలం నివాసాలు కావు, కుటుంబ గౌరవానికి, స్థాయికి ప్రతీకలు. పల్లెల్లో ఆత్మీయతను పంచే ఆ పొదరిళ్లు.. గతకాలపు వారసత్వ చిహ్నాలు. గడీలను పోలిన అధికార దర్పంతో కూడిన ఇళ్లు కొన్ని ఉంటే, వ్యవసాయ ధాన్యగారాలు, వ్యాపార లోగిళ్లుగా ఉన్న ఇళ్లు మరికొన్ని... సువిశాల వరండాతో, విశాల గదులతో ఆహ్లాదాన్ని పంచే పెంకుటిల్లు ఇంకొన్ని.. పాతబడినా ఆ ఇళ్లు గ్రామాల్లో నేటికీ దర్శనమిస్తున్నాయి. మనోళ్లు మనకందించిన ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి.

7

అడవిలో అక్కలు



మావోయిస్టు పార్టీలో ముగిసిన అన్నల ప్రస్థానం

ఉమ్మడి జిల్లా నుంచి మిగిలింది ముగ్గురే మహిళలు

రెండు దశాబ్దాలకుపైగా అజ్ఞాతంలోనే..

సాయుధ పోరాట విరమణకు వ్యతిరేకం

లొంగుబాట్లకు దూరం

మావోయిస్టు పార్టీ ఉద్యమంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన అన్నల ప్రస్థానం ముగిసిపోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు మాత్రమే ఆ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురూ ఇరవై ఏళ్ల క్రితమే అజ్ఞాతంలోకి వెళ్లారు. తాజాగా సాయుధ పోరాట విరమణ చేస్తూ లొంగిపోయినవారి జాబితాలోనూ వీరి పేర్లు కానరాలేదు. చావోరేవో ఇక్కడే తేల్చుకుంటామంటూ ఈ ముగ్గురు అక్కలు చెప్పకనేచెప్పినట్లు అర్థమవుతోంది. 50 ఏళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో పురుడుపోసుకున్న విప్లవోద్యమం నేడు కనుమరుగయ్యే పరిస్థితికి చేరడం గమనార్హం.

సంగారెడ్డి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నక్సల్‌బరి పోరాటాలు, పీపుల్స్‌వార్, జనశక్తి, ప్రస్తుత మావోయిస్టు ఉద్యమాలతో ఉమ్మడి మెదక్ జిల్లా, హుస్నాబాద్, చేర్యాల ప్రాంతాలకు విడదీయరాని బంధం ఉంది. దుబ్బాక, నర్సాపూర్, గిరాయిపల్లి, ఇందుప్రియాల్, భూపతి, పద్మక్క దళాలుగా ఇక్కడ పీపుల్స్‌వార్ పనిచేసింది. కూడవెల్లి, మంజీర దళాలతో జనశక్తి హవా నడిచింది. దేశంలోనే మొదటి ఎన్‌కౌంటర్‌కు కొండపాక మండలం గిరాయిపల్లి వేదికైంది. అప్పట్లో అది సంచలనం. నాలుగు దశాబ్దాల పోరాటంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వందలాది మంది అడవిబాట పట్టారు. కొందరు నేలకొరగగా.. మరికొందరు లొంగిపోయారు. ఇప్పటికీ మరో ముగ్గురు మహిళలు అజ్ఞాతంలోనే ఉన్నారు.

ముగిసిన 'అన్న'ల ప్రస్థానం

అప్పటి పీపుల్స్‌వార్.. ఆ తర్వాత మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతల్లో చాలామంది ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తమ ప్రస్థానం ప్రారంభించినవారే. శాఖమూరి అప్పారావు, పోలిపేట కొండాల్‌రెడ్డి, రావుల శ్రీనివాస్, దుబాషి శంకర్, కాతా రామచంద్రారెడ్డి కేంద్ర, రాష్ట్ర కమిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ నేలకొరిగారు. జనశక్తి గ్రూపులో డేగల సుభాష్, రియాజ్, సంగన్న, భీమన్న దళాలూ మెతుకు సీమ పల్లెల్లో హవా సాగించాయి. ఆనాడు గిరాయిపల్లితోపాటు మేదినీపూర్, ఏడుపాయల, రామాయంపేట, ఇందుప్రియాల్, సీతారాంపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్లలో పెద్దసంఖ్యలో నక్సల్స్ చనిపోయారు. వందల సంఖ్యలో ప్రాతినిధ్యం వహించిన అన్నల్లో ప్రస్తుతం ఒక్కరు కూడా లేకపోవడం విడ్డూరంగా మారింది. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోహెడ మండలానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు కాతా రామచంద్రారెడ్డి ఎన్‌కౌంటర్‌లో చనిపోగా.. మరో కీలకనేత ధూళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన కుంకటి వెంకటయ్య సాయుధ పోరాట విరమణలో భాగంగా లొంగిపోయారు. దీంతో పార్టీలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన 'అన్న'ల ప్రస్థానం ముగిసిపోయింది.

మహిళలే మిగిలారు

- అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన కాశబోయిన స్వరూప పాతికేళ్ల క్రితం అజ్ఞాతంలో చేరారు. దండకారణ్యం

మిగతా 7వ పేజీలో

చలి షురూ..

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 14.7 డిగ్రీలు



మెదక్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. మెదక్ జిల్లాలోని నర్సాపూర్, పెద్దశంకరంపేట, టేక్మాల్, పాపన్నపేట, రామాయంపేటలో 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 14.8, సిద్దిపేట జిల్లా మార్కుక్‌లో 15 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలైనా చలి తీవ్రత తగ్గలేదు. తెల్లవారుజామున మంచు కురిసింది. రానున్న రోజుల్లో చలి పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారడంతో వృద్ధులు, చిన్నారులు వ్యాధుల బారిన పడుతున్నారు. వారం రోజుల క్రితం వరకు జిల్లాలో వర్షాలు కురిశాయి. వర్షం తగ్గిన అనంతరం పగటి ఉష్ణోగ్రతలు ఎండలు ఎక్కువై ఉక్కబోత మొదలైంది. ఇప్పుడు రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.

సంబరంగా సదర్

మెదక్‌లో ఆకట్టుకున్న దున్నరాజుల ప్రదర్శన





మెదక్‌లో దున్నరాజులతో విన్యాసాలు చేయిస్తున్న యువకులు

మెదక్ అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన సదర్ వేడుక ఉత్సాహంగా సాగింది. పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద అందంగా అలకరించిన దున్నపోతులతో డీజే పాటలకు అనుగుణంగా విన్యాసాలు చేయించారు. అంతకుముందు వేణుగోపాలస్వామి ఆలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు లడ్డూ యాదవ్, స్వప్న యాదవ్, కిట్టు యాదవ్, మురళీయాదవ్, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

'కపాస్' వద్దే వద్దు..

హైవేలపై పత్తి రైతుల ఆందోళన

మునిపల్లి/పుల్‌కల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు విధానంపై రైతులు భగ్గుమన్నారు. 'కపాస్ యాప్'తో కష్టాలపాలవుతున్నామని మండిపడ్డారు. పాత పద్ధతిలోనే పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా, చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి టోల్‌ప్లాజాల వద్ద జాతీయ రహదారులపై ధర్నా చేశారు. రైతుల ధర్నాకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు. పత్తి కొనుగోలు పరిమితిని 7 క్వింటాళ్లకు తగ్గించడంతో మిగిలిన పత్తిని ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. కపాస్‌యాప్, కొత్త విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా పత్తిలో తేమ శాతం పెరిగిందని, ప్రభుత్వం విధించే తేమ శాతం నిబంధన తగ్గించాలని కోరారు. కపాస్ యాప్‌లో సాంకేతిక లోపాల కారణంగా రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు వారిని సముదాయించి విరమింపజేశారు. కంకోల్ వద్ద ధర్నాలో నాయకులు పైతర సాయికుమార్, శశికుమార్, సతీష్ కుమార్, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, రసూల్ పటేల్, బుర్కల పాండు, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తాడ్దానిపల్లి వద్ద నిర్వహించిన ధర్నాలో అందోలు, పుల్కల్, వట్‌పల్లి, చౌటకూర్, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల రైతులు పాల్గొన్నారు.



తాడ్దానిపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



సాంకేతికత ఉత్తిమాటే

కొనుగోలు కేంద్రాల్లో అవే సమస్యలు

టెండర్ల దశలోనే ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు

మెదక్ జిల్లాలో రెండు డ్రయ్యర్లతోనే సరి

కేంద్రాలకు తెచ్చిన ధాన్యంలో తరుగు, తాలు పేరిట కోత

మెదక్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు, ప్రభుత్వం చేసిన ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. రైతులకు నష్టం కలగకుండా అత్యాధునిక యంత్రాలను, సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పిన మాటలు అమలు కాలేదు. ధాన్యం ఆరబెట్టే యంత్రాలు, ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి రాలేదు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం కారణంగా ఆరబెట్టిన ధాన్యం వర్షాలకు తడిసి రైతులు నష్టపోతున్నారు. ఈసారి కొనుగోళ్లలో ఆలస్యాన్ని నివారించడానికి, రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 510 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ధాన్యం ఆరబెట్టే యంత్రాలు (ఆటోమెటిక్ డ్రయ్యర్లు), ప్యాడీ క్లీనర్లు 100 వరకు అవసరమవుతాయని మార్కెటింగ్‌శాఖకు ఇండెంట్ పెట్టారు. సీజన్ ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు అందుబాటులోకి రాలేదని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు.

మార్కెటింగ్‌శాఖ నిర్లక్ష్యం

రైతులు పండించిన ధాన్యం పౌరసరఫరాలశాఖ కొనుగోలు ఆధ్వర్యంలో చేస్తున్నా.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖదే. ఇందుకోసం రైతుల నుంచి కొనుగోలుచేసే ధాన్యం విలువలో ఒక శాతం కమీషన్ కింద ఆ శాఖకు అందజేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఒక్కో సీజన్‌లో కనీసం రూ.7 కోట్లు కమీషన్ కింద మార్కెటింగ్ శాఖకు అందుతోంది. అయినప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆ శాఖ విఫలమవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 406 సాధారణ ప్యాడీ క్లీనర్లు, పది సెమీ ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, ఆరు ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు, 571 మాయిశ్చర్ మీటర్లు, 518 వెయింగ్ మెషిన్లు, 11,625 టార్పాలిన్లు, 450 హస్క్ రిమూవర్లు, 450 కాలీపర్స్, రెండు ఆటోమెటిక్ డ్రయ్యర్లు ఉన్నాయని మార్కెటింగ్‌శాఖ అధికారులు లెక్క చెబుతున్నారు. ధాన్యాన్ని వెంటనే ఆరబెట్టడానికి ఉపయోగపడే ఆటోమెటిక్ డ్రయ్యర్లు కేవలం రెండు మాత్రమే అందుబాటులో ఉండడంతో మిగతా కేంద్రాల్లో ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబోస్తున్నారు.

ఎటూ తేలని టెండర్లు

మెదక్ జిల్లాకు వంద ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు సమకూర్చడానికి మార్కెటింగ్‌శాఖకు ఇండెంట్ పెట్టినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఈ విషయమై జిల్లా మార్కెంటింగ్‌శాఖ అధికారి నాగరాజును సంప్రదించగా సివిల్‌సప్లై అధికారులు పెట్టిన ఇండెంట్‌ను రాష్ట్ర కమిషనరేట్‌కు పంపించామని తెలిపారు. హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) టెండర్ల ప్రక్రియ చేపట్టనుందని వివరించారు. అదనపు కలెక్టర్ నగేష్ ఇప్పటికే హాకా ప్రతినిధులతో మాట్లాడారని పేర్కొన్నారు. కొనుగోళ్లు ప్రారంభమై పదిహేను రోజులు గడుస్తున్నా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రాకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎపిటోరియా పరిశ్రమలో అగ్నిప్రమాదం

ఒక్కసారిగా వ్యాపించిన మంటలు

అప్రమత్తమైన పరిశ్రమ ప్రతినిధులు

మంటలను అదుపుచేసిన అగ్నిమాపక శకటాలు



ఎపిటోరియా పరిశ్రమలో ప్రమాదంలో కాలిపోయిన యంత్రాలు

హత్నూర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులో ఉన్న ఎపిటోరియా యూనిట్-1 పరిశ్రమలో సాల్వెంట్ రికవరీ బ్లాక్ సమీపంలో శనివారం రాత్రి మంటలు వ్యాపించాయి. పరిశ్రమలో కార్మికులు రాత్రి 10 గంటలకు విధుల్లో చేరి ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. సాల్వెంట్ రికవరీ బ్లాక్ వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కార్మికులు ఉలిక్కిపడి భయంతో పరుగులు తీశారు. సేఫ్టీ సిబ్బందితో పాటు మరి కొంతమంది వెంటనే అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక శకటాలను రప్పించి మంటలను పూర్తిగా అదుపు చేశారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియానికి మహర్దశ

రూ.10 కోట్లు మంజూరు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని బీఆర్ అంబేడ్కర్ స్టేడియంకు మంచి రోజులు రానున్నాయి. నిధుల కొరతతో స్టేడియంలో సౌకర్యాలు, కోచ్‌లు, క్రీడా సామగ్రి లేక క్రీడాకారులు తీవ్ర నిరాశలో ఉన్నారు. తాజాగా స్టేడియం అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేస్తూ సర్కారు ఈ నెల 1న జీవో జారీ చేసింది. అంబేడ్కర్ స్టేడియంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం సంబంధిత శాఖ ద్వారా రూ. 32.20 కోట్ల నిధులతో అంచనాలు రూపొందించి స్పోర్ట్స్ అథారిటీకి ప్రతిపాదనలు పంపించారు. ఔట్‌డోర్ స్టేడియం (హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, క్రికెట్ విత్ గ్యాలరీ, పెవీలియన్ భవనం, గేట్లు) కోసం రూ.5 కోట్లు, అదేవిధంగా ఇండోర్ స్టేడియం (షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వ్రెస్లింగ్, వాలీబాల్, బాక్సింగ్, చెస్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్) కోసం రూ.12.5 కోట్లు, అలాగే సింథటిక్ ట్రాక్ కోసం రూ.10 కోట్లు, ఐదు అంతస్తుల స్పోర్ట్ హాస్టల్ భవన నిర్మాణానికి రూ.4 కోట్లు, హైమాస్ట్ లైట్స్, జనరేటర్స్‌కు రూ.35 లక్షలు, బాక్స్ క్రికెట్ ఇతరత్ర అవసరాలకు రూ.35 లక్షల నిధులు అవసరమంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో రూ.10 కోట్ల నిధుల మంజూరుకు సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిలో ఏయే అభివృద్ధి పనులు చేపడుతారనే విషయం త్వరలో ప్రభుత్వం నుంచి స్పష్టత రానుందని జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఖాసీంబేగ్ తెలిపారు.



సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియం ప్రధాన ద్వారం

ఇంద్రేశంలో రోడ్డు మరమ్మతులు చేయాలి

పటాన్‌చెరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లుగుంతలమయంగా ప్రయాణం చేయలేని పరిస్థితుల్లో ఉన్నాయని, మరమ్మతులు చేయాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇంద్రేశంలో రిలేనిరాహార దీక్షలు చేపట్టారు.





చరిత్రాత్మకమైన వందేళ్ల చరిత్ర కలిగిన దుబ్బాక పోస్టాఫీస్ భవనం, రామక్కపేట గ్రామంలో శిథిలావస్థలో మిద్దె ఇల్లు

సండే స్పెషల్ (Sunday Special)

భవన వైభవం..



రామక్కపేట గ్రామంలో మిద్దె ఇల్లు



రఘోత్తంపల్లిలో అందమైన మిద్దె పెంకుటిల్లు

డంగు సున్నం ఇళ్ల దర్పం

- పల్లెవాకిళ్లలో పొదరిళ్లు
- సంస్కృతికి అద్దం పట్టిన వారసత్వ లోగిళ్లు
- పెళ్లి వారికి విడుదులు.. బంతి భోజనాల భవంతులు
- ఆహ్లాదాన్ని పంచే అపురూపమైన పెంకుటిళ్లు
- కాలంతో కనుమరుగవుతున్న ఆనవాళ్లు

దుబ్బాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కుటుంబాలకు, ఆత్మీయతకు నిలయాలుగా నిలిచిన ఆనాటి ఇళ్లు పట్టణీకరణ వేగంలో కనుమరుగవుతున్నాయి. ఊళ్లో పెళ్లి సందడి ఉంటే, పెళ్లివారు విడిదిగా ఉండే విశాలమైన వరండా ఉన్న ఇళ్లు... బంతి భోజనాలకు వేదికలైన భవంతులు నేడు కనిపించడం లేదు. పిట్టగూడు ఉన్నా... పిట్టంత సందడి ఉండాలి అనే నానుడి మారింది. గీత గీసుకుని, ఏకాంతంగా మారిన కాంక్రీట్ భవనాల మధ్య, ఇంకా అక్కడక్కడ మిగిలిన డంగు సున్నంతో నిర్మించిన ఆనాటి ఇళ్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

వరండాలు.. భారీ స్తంభాలు

పూర్వీకుల ఆనవాళ్లుగా దుబ్బాక మండలంలోని కొన్ని గ్రామాల్లో డంగు సున్నం ఇళ్లు ఇంకా మిగిలి ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో దొరలు నిర్మించిన పోస్టాఫీస్ మినహా పాత నిర్మాణాలు కూల్చివేయబడ్డాయి. దుబ్బాక మున్సిపల్‌లోని లచ్చపేట గ్రామంలో ఈ ఇళ్లు ఎక్కువగా కనిపిస్తాయి. వ్యాపార కేంద్రంగా ఉన్న లచ్చపేటలో, ప్రతీ ఇల్లు స్థాయిని చాటే విధంగా వరండా ఉండేలా, భారీ స్తంభాలతో నిర్మించారు. ఈ ఇళ్ల గోడలు సుమారు 4 అడుగుల వెడల్పుతో అత్యంత పటిష్టంగా ఉంటాయి. ఇంటి పైకప్పు (మిద్దె)ను ఇనుప చువ్వలు, డంగు సున్నంతో నిర్మించేవారు. ఈ నిర్మాణ శైలి వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉండి, వాతావరణానికి అనుగుణంగా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

కనువిందు చేసే పెంకుటిళ్లు

దుబ్బాక మండలంలో పెంకుటిళ్లు కనువిందు చేస్తాయి. పూర్వీకులు మల్లేశాల, చతుశాల పెంకుటిళ్లను నిర్మించుకున్నారు. వీటిలో విశాలమైన గదులు, మల్లేశాల, వరండా, మండువా లోగిళ్లు, గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరించేలా ఉండే నిర్మాణాలు అబ్బురపరుస్తాయి. వ్యాపార వర్గాల ఇళ్లకు వరండా, వాకిలి పెద్దగా ఉంటే, రైతుల ఇళ్లలో కట్టె సజ్జ, కర్రతో నిర్మించే అటుకు, వ్యవసాయ సామగ్రి పెట్టుకునేందుకు, ధాన్యం నిలువ ఉంచేందుకు విశాలమైన గదులు, వసారాలు ఉండేవి. ఈ పెంకుటిళ్లు పలు రకాల ఉంటాయి. మట్టి పెంకు, కుమ్మరి పెంకు, బంగ్లా పెంకు. మట్టి పెంకును కలపతో కూడిన ఫ్రేమ్‌లో బిగించి కూర్పుగా అమర్చారు. బంగ్లా పెంకును ఈ ప్రాంతంలో ఎక్కువగా టేకు కలపతో, గానుగ (డంగు) సున్నంతో కప్పి నిర్మించారు. వీటి పైకప్పుతో పాటు, ఇంటి ముందు భాగంలో చూడడానికి అందమైన కళాకృతుల డిజైన్లు, ఆకర్షణీయమైన తలుపులు, దర్వాజాలు బిగించేవారు. పల్లెల్లో ఒకప్పుడు నిర్మించిన ఈ ఇళ్లు కేవలం నివాసాలు కావు... ఆహ్లాదం పంచే, పూర్వీకుల ఇంజినీరింగ్ ప్రతిభను చాటే లోగిళ్లు!

ఆత్మీయ అనుబంధాల అరుగులు

విశాలమైన వరండాలు, అరుగులు పూర్వం మానవ సంబంధాలకు ప్రతీకగా నిలిచేవి. ఫంక్షన్‌హాళ్లు లేని కాలంలో, పెద్ద వరండా ఇళ్లలోనే వివాహాలు, బంతి భోజనాలు నిర్వహించేవారు. వరుడికి విడిదిగా, పెండ్లి ఎదుర్కోలుకు వేదికగా ఈ ఇళ్లు ఉండేవి. పెళ్లి పందిళ్లు, టెంట్లు లేకపోవడంతో, పెద్ద ఇళ్ల యజమానిని బతిమిలాడి, శుభకార్యాలకు వినియోగించుకునేవారు. ఇరుకైన ఇళ్లు ఉన్నవారు, బంధువులు వచ్చినప్పుడు, పెద్ద ఇళ్ల వరండాలపైనే రాత్రులు పడుకునేవారు. వేసవిలో పెద్ద వరండా ఉన్న ఇంటి ముందే పడక వాల్చేవారు. ఏదేమైనా, కాలంతోపాటు ఆత్మీయతలు దూరమైనట్టుగానే, ఈ ఆత్మీయ లోగిళ్లు కూడా శిథిలమై కనుమరుగవుతున్నాయి.

దుబ్బాక సంస్థాన వైభవం..



ఉమ్మారెడ్డి భవనం

దుబ్బాక సంస్థానాన్ని పాలించిన పన్యాల వంశీయుల పూర్వీకులు, రాజ ఉమ్మారెడ్డి నిర్మించిన ఈ భవనం నేటికీ వారసత్వ చిహ్నంగా నిలుస్తోంది. పూర్వం ఈ ప్రాంతం దోబాగ్ (రాంబాగ్, లక్మన్ బాగ్ అనే రెండు తోటలు)గా ఉండటం వలన దుబ్బాక పేరు వాడుకలోకి వచ్చిందని చెబుతారు. 1930ల మధ్యకాలంలో రాజ ఉమ్మారెడ్డి ఈ భవనాన్ని డంగు సున్నం, ఇనుప మెటీరియల్‌తో రెండు భవంతులుగా నిర్మించారు. ప్రవేశంలో నీటిని చిమ్మే ఫౌంటేన్‌లు, ప్రత్యేక డిజైన్ విండోలు, పెద్ద ద్వారాలు, లాబీలు, గ్యాలరీలు, చుట్టూ గుండ్రటి బాల్కనీలు, అంతర్గత హాల్ దీని ప్రత్యేకతలు. బయటి నుంచి భవనాన్ని అల్లుకుని మెలికలు తిరిగే విశాలమైన మెట్ల ద్వారం ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ నిర్మాణం ఆర్ట్ డెకో శైలిలో, కొందరి అభిప్రాయం ప్రకారం ఇటాలియన్ ఆర్కిటెక్చర్ శైలిలో నిర్మించబడింది. దక్షిణ ద్వారం ఉండటం వాస్తు (తూర్పు, ఉత్తర ద్వారాలకు ప్రాధాన్యత ఉంటుంది) ప్రకారం భిన్నంగా కనిపిస్తుంది. ఈ భవనం హైదరాబాద్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయాన్ని పోలి ఉండటంతో, చివరి నిజాం ప్రభువు పర్యవేక్షణలో దుబ్బాక దొరలు దీనిని నిర్మించారని చెబుతారు. వాస్తవానికి హైదరాబాద్ అబిడ్స్‌లోని ఎస్‌బీఐ భవనం కూడా పూర్వం దుబ్బాక దొరలదే. నక్సల్స్ ప్రభావంతో 1980 ప్రాంతంలో దానిని ఎస్‌బీహెచ్ (ప్రస్తుత ఎస్‌బీఐ)కి అద్దెకిచ్చి, ఆ తర్వాత వ్యాపారికి విక్రయించారు. దుబ్బాక దొరలకు ప్రస్తుతం పూర్తిస్థాయి వారసత్వ ఆస్తులు ఇక్కడ లేవు.

రెండు నెలల పసికందును ట్రాక్టర్ కింద పడేసిన తల్లి

- మద్యం మత్తులో ఘాతుకం
- చిన్నారిని కాపాడిన గ్రామస్థులు
- పోలీసులకు అప్పగింత



తల్లికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

మనోహరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కన్న తల్లి మద్యం మత్తులో రెండు నెలల పసికందును చంపేందుకు ప్రయత్నించింది. భర్త పని చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని ఇంటికి వచ్చిన గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్ సిబ్బందితో వాగ్వాదానికి దిగి.. ఆ ట్రాక్టర్ టైర్ల కిందే చిన్నారిని పడేసింది. అక్కడున్న గ్రామస్థులు చూసి, బిడ్డను రక్షించి పోలీసులకు అప్పగించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మెహతాబేగం, ఎస్సై సుభాష్‌గౌడ్, ఆశా టీచర్ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్వామి, సంధ్య దంపతులు. వీరికి మూడు, ఆరేళ్ల కుమారులు ఉండగా, రెండునెలల క్రితం పాప జన్మనిచ్చింది. సంధ్య భర్త ఇటీవల గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్‌పై వారం రోజులపాటు పనికి వెళ్లాడు. అయితే, శుక్రవారం వారుంటున్న ఇంటికి గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ వచ్చింది. దీంతో తన భర్త వారం పాటు చేసిన పనికి కూలీ ఇవ్వాలని ట్రాక్టర్‌పై వచ్చిన సిబ్బందిని అడిగి గొడవపడింది. తమకు డబ్బుల విషయం తెలియదని, గ్రామపంచాయతీ వారు డబ్బులు ఇస్తారని సమాధానం ఇచ్చారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సంధ్య రెండునెలల చిన్నారిని చెత్త టైర్లకింద వేసింది. అక్కడున్నవారు గమనించి రక్షించారు. విషయం తెలిసి ఆశా కార్యకర్తల డయల్ 100కు కాల్ చేయగా, పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. తల్లికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సంధ్య మద్యానికి బానిసై.. అప్పుడప్పుడు మతిస్థిమితం లేనట్లు వ్యవహరిస్తుందని పోలీసులు, అంగన్‌వాడీ టీచర్ చెప్పారు. తల్లీ, ముగ్గురు పిల్లలను మెదక్ సీడబ్ల్యూసీ కౌన్సెలింగ్ కేంద్రానికి తరలించారు.

మద్యం మత్తులో తల్లిని చంపిన కొడుకు

టేక్మాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని, పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకురావాలని రోజూ గొడవ పడుతూ మద్యం మత్తులో తల్లిని చంపేశాడో తనయుడు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు టేక్మాల్ ఏఎస్సై కృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోహన్‌గారి సత్తమ్మ(56) కూలీపని చేసుకుంటు జీవనం సాగిస్తుంది. ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురు వివాహం చేసింది. ఆమె కొడుకు సుదర్శన్‌కూ వివాహం చేయగా రోజూ మద్యం తాగి వచ్చి భార్యను వేధించేవాడు. దీంతో మూడేళ్ల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన భార్యను తీసుకురావాలని తల్లిని పీడించేవాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చిన సుదర్శన్ తల్లితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న కర్రతో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే చపోఓయింది. కుమార్తె అనురాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

430 గ్రాముల పప్పిస్ట్రా పౌడర్ పట్టివేత

తూప్రాన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా తూప్రాన్ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారుల తనిఖీలో 420 గ్రాముల నిషేధిత పప్పిస్ట్రా పౌడర్ పట్టుపడింది. ఓ ప్రైవేట్ బస్సులో ఈ పౌడర్ తరలిస్తుండగా పట్టుకున్నట్లు నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ గులాంముస్తాఫా పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. రూట్‌వాచ్‌లో భాగంగా తూప్రాన్ జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ప్రైవేటు బస్సులో రాజస్థాన్‌కు చెందిన రావల్‌సింగ్ వద్ద 420 గ్రాముల పప్పిస్ట్రా పౌడర్ లభించింది. పౌడర్ స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులో తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి పౌడర్ తీసుకొస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ పౌడర్ డాబా హోటళ్లలో తయారయ్యే తినుబండారాల్లో వినియోగిస్తారని సమాచారం. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్‌ఐలు ఖాజా అజీజ్‌అహ్మద్, రాఘవేందర్‌రావు, సిబ్బంది అనిల్, సత్తయ్య, ప్రభాకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు



అనిల్‌రెడ్డి(ఫైల్)

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండురోజుల క్రితం అదృశ్యమైన యువకుడు మంజీరానదిలో శవమై తేలాడని నారాయణఖేడ్ ఎస్‌ఐ రావుల శ్రీశైలం శనివారం తెలిపారు. నాగల్‌గిద్ద మండలం ఏనక్‌పల్లి గ్రామానికి చెందిన ఊస అనిల్‌రెడ్డి(22) నారాయణఖేడ్‌లోని ఓ ప్రైవేటు వ్యాపార సంస్థలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులకు తోడు సొంత వ్యాపారం చేసుకుంటానని కుటుంబసభ్యులతో చెప్పేవాడు. ఈనెల 6న నారాయణఖేడ్‌లో నివాసముంటున్న గది నుంచి తెల్లవారుజామున వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అనిరెడ్డి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా మనూరు మండలం రాయిపల్లి సమీపంలో మంజీరానది వద్ద అతడి వాహనం కనిపించింది. రెండురోజులుగా ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో నదిలో గాలించినా ఫలితం దక్కలేదు. శనివారం ఉదయం కూడా గాలించేందుకు వెళ్లగా అనిల్‌రెడ్డి మృతదేహం మంజీరా నదిలో తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో శవ పరీక్ష చేయించి, కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పరిశ్రమలో అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన సామగ్రి ● రూ. 20 లక్షల మేర ఆస్తినష్టం



కాలిపోయిన పరిశ్రమను పరిశీలిస్తున్న సిబ్బంది

మనోహరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ పరిధి దిల్లాయి సైకిల్ పరిశ్రమలో శనివారం విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. ఇందుకు సంబంధించి వివరాలు.. కూచారం గ్రామ పరిధిలో దిల్లాయి మొబిటెడ్ ప్రైవేట్ లిమిటెడ్ సైకిల్ పరిశ్రమ ఉంది. పరిశ్రమలో సైకిళ్లు తయారు చేస్తారు. శనివారం పరిశ్రమలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో పరిశ్రమలోని సామగ్రితో పాటు కార్యాలయం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఉదయం ఏడు గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగడం, కార్మికులు పది గంటలకు విధులకు వస్తుండంతో వారు రాకముందే ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం విషయం తెలియగానే చుట్టుపక్కల మండలాల నుంచి మూడు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను ఆర్పివేశాయి. మనోహరాబాద్ ఎస్సై సుభాష్‌గౌడ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సాహిత్య కార్యక్రమాల్లో ప్రతిభ చూపాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బహుమతి

కంది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని ఉమ్మడి జిల్లా రీజనల్ లెవల్ కోఆర్డినేటర్ బహుమతి అన్నారు. తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో నిర్వహించిన స్పార్క్ ఫెస్ట్-2025 (సాహిత్య పోటీలు) శనివారం కందిలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ (వాద-ప్రతివాద), పాటల, క్విజ్, వక్తృత్వ, సృజనాత్మక సాహిత్య కార్యక్రమాలకు సంబంధించిన పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేసి పంపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ విద్యార్థికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు గౌస్, జగదీష్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, అకడమిక్ కో ఆర్డినేటర్ వసీముద్దీన్, ఉమ్మడి మెదక్ జిల్లాలోని గురుకులాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతూర్ సీడ్స్ కంపెనీపై కేసు

- రైతులతో ఒప్పందం చేసుకునే 4547 రకం వరి వంగడం సాగు
- రుక్మాపూర్‌లో పంటనష్టంపై క్షేత్రస్థాయిలో విచారణ
- జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ వెల్లడి

మెదక్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విత్తన ఏజెన్సీ పాతూర్ సీడ్స్ కంపెనీపై నకిలీ విత్తనాలు రైతులకు సరఫరా చేసినట్లు ఆరోపణలు వస్తున్న దృష్ట్యా ప్రస్తుతానికి రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చేగుంట మండలంలోని రుక్మాపూర్‌లో పలువురు రైతులు సుమారు 100 ఎకరాల్లో 4547 రకం వరి వంగడాన్ని వేశారని తెలిపారు. తీరా చేతికొచ్చే దశలో కొంతమేర పంట నష్టపోయినట్లు సమాచారం అందిందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెల్లడవుతాయని వివరించారు. ప్రస్తుతం మేకల శ్రీనివాస్‌కు చెందిన రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో వరిపంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన సంస్థ యాజమాన్యం రైతులతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకే వ్యవసాయ క్షేత్రాలలో పంట పరిశోధనలు చేస్తారని అన్నారు. రైతులకు యాజమాన్యంచే పరిహారం ఇప్పించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. పాతూర్ సీడ్స్ ఆర్గనైజర్‌తో తమ అధికారులను మాట్లాడమని ఆదేశించినట్లు వివరించారు. మరో రెండురోజుల్లో పూర్తిస్థాయి నివేదిక కలెక్టర్‌కు నివేదిస్తామని వెల్లడించారు. మెదక్ జిల్లాలో అనేక విత్తన సంస్థలు ఆడ, మగ వరి వంగడాలపై పరిశోధనలు నిర్వహిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు వాటిపై ఉదారంగా వ్యవహరిస్తుండడంతో రైతులకు చెల్లించాల్సిన పంట డబ్బుల కోసం కంపెనీ యజమానుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు.

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పుణ్యావాచకం, పుట్ట బంగారం, హోమం ● నేడు రుక్మిణీ పాండురంగ కల్యాణం



కంది : ఆలయ ఆవరణలో పుట్ట బంగారం సేకరిస్తున్న వేదపండితులు

కంది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోశ్ఛరణల మధ్య పుణ్యావాచకం, పంచగవ్య సమ్మేళనం, పుట్ట బంగారం సేకరణ, హోమం, ఎదుర్కోలు, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రాకకోసం కందిలోని పురవీధుల్లో భారీఎత్తున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం, సోమవారం గరుడ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పండితులు మధుసూదన్‌రావు పంతులు, శ్రీనుపంతులు, సురేష్ పంతులు, గ్రామస్థులు జంగయ్య, యాదగిరి, శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని శ్రీనగర్‌లో లక్ష్మీనరసింహస్వామి ఆలయ 4వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, లక్షపుష్పార్చన, కల్యాణం, దీపోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేశారు.

హనుమాన్ ఆలయాలకు భక్తుల తాకిడి

నారాయణఖేడ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శనివారాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ ప్రాంతంలోని పలు హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చరిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయంలో ఉదయం అభిషేకం, చందనం, మహాహారతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ ఆశీస్సులు అందించి, దాతల సహకారంతో మహాప్రసాదాన్ని అందించారు. కాగా ఖేడ్ పట్టణంలోని కల్పనా హనుమాన్, మంగల్‌పేట హనుమాన్, సిరూర్ కాలనీలోని శివపంచాయతన అభయాంజనేయస్వామి, దోపూరు లొంక హనుమాన్ ఆలయాల్లోనూ భక్తుల రద్దీ కనిపించింది.



లక్షపుష్పార్చన పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి



వర్గల్ : స్వామివారి నామాల ఆకృతిలో దీపారాధన చేసిన భక్తులు

నామాల ఆకృతిలో దీపారాధన

వర్గల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాలతో శనివారం సాయంత్రం నిర్వహించిన నిత్య కార్తీక దీపోత్సవంలో భాగంగా భక్తులు స్వామివారి నామల ఆకృతిలో దీపారాధన చేశారు.

అడవిలో అక్కలు

(5వ పేజీ తరువాయి)

సభ్యురాలిగా ఉన్న ఆమెపై రూ.2లక్షల రివార్డు ఉంది. చిన్ననాడే తల్లిదండ్రులు చనిపోతే నానమ్మ, తాత వద్ద పెరిగింది. పదో తరగతి చదువుతున్నప్పుడే ఉద్యమానికి ఆకర్షితురాలై అడవిబాట పట్టింది. నానమ్మ, తాత చనిపోతే గ్రామస్థులే చందాలు వేసి అంత్యక్రియలు చేశారు. ప్రస్తుతం తనకు చెల్లె మాత్రమే ఉంది.

- నంగునూరు మండలానికి చెందిన రంగు అరుణ అలియాస్ పద్మక్క 20 ఏళ్లుగా మావోయిస్టుల్లో ఉన్నారు. ఛత్తీస్‌ఘడ్‌లోని దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీలో యాక్షన్‌టీం మెంబర్‌గా ఉన్న పద్మక్కపై రూ.2లక్షల రివార్డు ఉంది. అరుణ తల్లి అనారోగ్యానికి గురై మంచం పట్టింది. కూతురు ఎక్కడుందో.. ఎలా ఉందో తెలియదని చెబుతోంది. బంధువులకు కూడా ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది.

- మిరుదొడ్డి మండలం ధర్మారంకు చెందిన రంగనబోయిన భాగ్య అలియాస్ కల్పన అలియాస్ రూపి 23 ఏళ్లుగా వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం నార్త్ బస్తర్ ప్రతాపూర్ ఏరియా కమాండర్‌గా ఉన్న భాగ్యపై రూ.4 లక్షల రివార్డు ఉంది.

గుంతలమయంగా కంది చౌరస్తా

- నిత్యం వాహనాల రాకపోకలతో బిజీ
- 65వ జాతీయరహదారిపై ప్రమాదకరంగా గుంతలు
- బెంగళూరు బైపాస్ రోడ్డుపై రెండు అడుగుల లోతు గుంతలు
- తాత్కాలిక మరమ్మతులతో తీరని వాహనదారుల ఇక్కట్లు


కందిలోని 65వ నంబరు జాతీయ రహదారి వైపు ఏర్పడిన భారీ గుంతలు


కంది చౌరస్తాలో బెంగళూరు బైపాస్ రోడ్డుపై రెండడుగుల లోతు గుంతలు

కంది, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కందిలో అత్యంత రద్దీగా ఉండే ప్రధాన రోడ్లపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కందిలో ఓవైపు 65 నంబరు జాతీయ రహదారి, మరోవైపు బెంగళూరు బైపాస్ రోడ్డుతో కూడిన కంది ప్రధాన చౌరస్తాపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కంది గ్రామం చౌరస్తాకు ఇరువైపులా ఉండటంతో వాహనదారుల రాకపోకలతో ఎప్పుడూ బిజీగా ఉంటుంది. కంది చౌరస్తాలో రోడ్డు గత ఏడాది కాలంగా వాహనాల రాకపోకల ఒత్తిడికి పాడవుతూనే ఉంది. కంకర తేలి, దుమ్ము వస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ చౌరస్తాకు ఇరువైపులా ఉన్న ప్రధాన రహదారుల్లో రెండు అడుగుల మేర పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ చౌరస్తా దాటేందుకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. భారీ వాహనాలు ఈ గుంతల్లో దిగబడుతుండటంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఆగి పోతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ చౌరస్తాలో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నప్పటికీ మళ్లీ కొద్దీ రోజులకే గుంతలు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

భగీరథ లీకేజీల వల్లే గుంతలు

కంది చౌరస్తాలో మిషన్ భగీరథ నీటి లీకేజీతో రెండు ప్రధాన రహదారులు తరచూ పాడవుతున్నాయి. అదిగాక నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రోడ్డుపై ఒత్తిడి ఎక్కువగా ఉంది. నేషనల్ హైవే అధికారులతో కలిసి పలుమార్లు మరమ్మతులు చేపట్టాం. అయినా నీటి లీకేజీ ఆపకపోవడం వల్ల తరచూ రెండు వైపులా రోడ్లపై గుంతలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారి విస్తరణ చేపడుతున్నందున త్వరలోనే ఈ గుంతలకు శాశ్వత పరిష్కారం చేస్తాం.

-డీఈ రామకృష్ణ, ఆర్అండ్‌బీ

బిలాల్‌పూర్‌లో తాగునీటికి కటకట


బిలాల్‌పూర్‌లోని బీసీ కాలనీలో పాడైన బోరు వద్ద ఖాళీ బిందెలతో కాలనీవాసుల నిరసన

కోహీర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నీటి వనరుల్లో భారీగా నీరు చేరి భూగర్భజలాలు పుష్కలంగా పెరిగినప్పటికీ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో మాత్రం ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామంలోని బీసీ కొత్త పాతకాలనీలలోని మూడు తాగునీటి బోర్లు చెడిపోయి చాలా రోజుల గడిచినప్పటికీ వాటిని బాగు చేసేవారు లేక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చెడిపోయిన బోర్లను బాగు చేయించాలని గ్రామస్థులు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. గట్టిగా ప్రశ్నిస్తే.. నిధుల్లేవ్.. ఎక్కడినుంచి తీసుకువచ్చి బాగు చేయించాలని బాధ్యతారహితంగా సమాధానం ఇస్తున్నారని బీసీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 150 కుటుంబాల ప్రజలు తాగునీటి కోసం నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. చేసేదేమీ లేక ఆ కాలనీవాసులే తలాకొంత డబ్బులు వేసుకుని పాడైన తాగునీటి బోర్లను బాగు చేసుకునే పనిలో పడ్డారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

బైక్ మెకానిజంలో ఉచిత శిక్షణ

- ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్

సంగారెడ్డి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు బైక్ (ద్విచక్ర వాహనం) మెకానిజంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్టేట్ బ్యాంకు గ్రామీణ ఉపాధి కల్పన శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ) డైరెక్టర్ రాజేశ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి 19 సంవత్సరాల నుంచి 45 యేళ్ల వరకు ఉన్న పురుషులు ఈ శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించడం జరుగుతుందని, బైక్ మెకానిజంలో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యాపార నిర్వహణ అభివృద్ధి, ఖాతాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించ నున్నట్టు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని, ఎంపికైన వారికి ఈ నెల 12వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్టు రాజేష్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు 94901033390, 9490129839 నంబర్లలో సంప్రదించాలని, కార్యాలయానికి రావడం వీలు కాని వారు ఆయా వాట్సాప్ నంబర్లకు దరఖాస్తులు పంపించవచ్చన్నారు.

ముగిసిన గురుకుల క్రీడోత్సవాలు

హత్నూర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హత్నూరలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల ఆవరణలో మూడు రోజులపాటు నిర్వహించిన గురుకుల పాఠశాల, కళాశాలల 11వ జోనల్ స్థాయి క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో వ్యక్తిగత ఓవరాల్ ఛాంపియన్స్‌గా అండర్ 14-విభాగంలో ఉప్పల్ పాఠశాల, అండర్-17 షేక్‌పేట పాఠశాల, అండర్-19, సింగూర్ పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్స్‌గా అండర్-14, 17, 19విభాగాలలో సింగూర్ పాఠశాల మూడు బహుమతులను కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ ఛాంపియన్ షిప్ ఫర్ గేమ్స్‌లో అండర్-14 సింగూర్ పాఠశాల, అండర్-17 కొండాపూర్ పాఠశాల, అండర్-19 అంబేడ్కర్ జూనియర్ కాలేజ్ హత్నూర కళాశాలలు కైవసం చేసుకున్నాయి. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ఫర్ గేమ్స్ అండ్ అథ్లెటిక్స్‌లో అండర్-14 సింగూర్ పాఠశాల, అండర్-17 హత్నూర యూజీ కళాశాల తదితరులు పాల్గొన్నారు. అండర్-19 సింగూర్ కళాశాల విజేతలుగా నిలిచి ట్రోఫీలు అందుకున్నాయి. విజేతలకు సర్టిఫికెట్లు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ కవిత, ఫిజికల్ డైరెక్టర్ గణపతి లాలు, శ్రీలత పాల్గొన్నారు.

డీసీసీబీ ఖాతాల సేకరణపై అవగాహన


డిపాజిట్లపై అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ సిబ్బంది

సంగారెడ్డి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ బ్యాంకు ఖాతాల సేకరణపై ఆ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కరపత్రాల ద్వారా శనివారం సంగారెడ్డి పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ డిపాజిట్ల మాసోత్సవంలో భాగంగా 444 రోజులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీతో స్వర్ణనిధి డిపాజిట్ స్కీమ్ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు, రైతులకు మరింత చేరువయ్యేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టినట్టు వారు వెల్లడించారు. డిపాజిట్లపై అధిక వడ్డీ రావడంతో పాటు బంగారంపై గ్రాముకు రూ.7400 అత్యధికంగా చెల్లించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వ్యవసాయం, వ్యాపార రుణాలను కూడా డీసీసీ బ్యాంకు అందిస్తున్నదన్నారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని డీసీసీబీ శాఖలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ జనార్దన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పడిపూజకు హాజరైన కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్

ఘనంగా అయ్యప్ప పడిపూజ

పటాన్‌చెరు నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు డివిజన్ పరిధి నందన్ రతన్ ప్రైడ్‌కాలనీలో శనివారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి చుట్టుపక్కల ప్రాంతాల్లో అయ్యప్ప మాల ధరించిన స్వాములు పెద్దఎత్తున తరలి వచ్చి, భక్తి పాటలు, భజనలతో హోరెత్తించారు. కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఐలాపూర్ మాణిక్‌యాదవ్, వెంకట్రావు, మాధవ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు లయన్స్ క్లబ్ చేయూత


దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేస్తున్న లయన్స్ బృందం

మెదక్ అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ మెదక్ సిటిజన్ దివ్యాంగులకు ఆసరాగా నిలిచింది. శనివారం పట్టణంలోని సత్యసాయి మందిరంలో జిల్లా గవర్నర్ అమర్‌నాథ్, క్యాబినెట్ ట్రెజరర్ ప్రవీణ్, ప్రెసిడెంట్ గందె సుధాకర్ ఆధ్వర్యంలో 33 మంది దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ అనితా, మెదక్ సెక్రటరీ రాజేందర్‌ప్రసాద్, పాస్ట్ ప్రెసిడెంట్ సురేందర్, కవిత, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి విజయానికి మెట్టు

అల్లాదుర్గం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలలో ఓటమి చెందిన క్రీడాకారులు నిరాశకు గురికావద్దని, ఓటమి విజయానికి మెట్టు అని అల్లాదుర్గం ఎస్ఐ డి. శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముస్లాపూర్‌లో నిర్వహించిన అల్లాదుర్గం మండల ప్రీమియర్(ఏఎంపీఎల్) క్రికెట్ టోర్నమెంట్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని, ఓటమి చెందిన క్రీడాకారులు నిరాశకు గురి కాకుండా మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోండ్ల రవి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో వందేమాతరం ఆలాపన


నర్సాపూర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నర్సాపూర్ ప్రధాన చౌరస్తాలో విద్యార్థులతో పాటు వందేమాతర గేయం ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్‌మల్లేశ్‌గౌడ్, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసానిసురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేస్‌యాదవ్, ఎల్లంకి కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్, బీజేపీ జిల్లా కార్యదర్శి బాలరాజు, జిల్లా కోశాధికారి ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి

- ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్

కల్హేర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకశాఖను ఏర్పాటు చేయాలని ఈ నెల 10న సంగారెడ్డి కలెక్టరేట్ ముందు చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్పీఆర్డీ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ కోరారు. గతంలో ఇచ్చిన 34 జీవోను వెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన కల్హేర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి కొందరు ఉద్యోగులను కేటాయించి ప్రత్యేకంగా దివ్యాంగుల సంక్షేమశాఖ ఏర్పాటు కోసం 2022 డిసెంబరులో 34 నంబర్ జీవోతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే నేటికీ అది అమలు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 23 మాసాలు కావస్తున్నా ఈ ప్రభుత్వం కూడా దీన్ని అమలు పరచడం లేదని విమర్శించారు. ఇతర శాఖల్లో వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమంపై చిత్త శుద్ధి ఉంటే వెంటనే ప్రత్యేకశాఖ ఏర్పాటు చేసి అందులో ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10న నిర్వహించే ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని వికలాంగులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బస్వరాజ్ పాటిల్ కోరారు.

సంక్షిప్తం

మెదక్ సీఎస్ఐ పాస్టరేట్ ఎన్నిక

మెదక్ కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెదక్ సీఎస్ఐ పాస్టరేట్ ఎన్నికలు శనివారం మెదక్ చర్చ్ ప్రాంగణంలోని సండే స్కూల్ హాల్లో నిర్వహించారు. ఈ ఎన్నికలు మినిస్ట్రియల్ కమిషనరీ విల్సన్, డీసీసీ వైస్ చైర్మన్ జేసుదాస్, ప్రెస్ బీటర్ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణం ఓటర్లు, పోటీదారులతో సందడిగా మారింది. ఈ సందర్భంగా ప్రెస్‌బీటర్ ఇన్‌చార్జి శాంతయ్య మాట్లాడుతూ పాస్టరేట్ ఎన్నికల్లో భాగంగా 20 మంది సభ్యుల ఎన్నికకు, 3 సంవత్సరాల కాలపరిమితితో ఉంటుందన్నారు. ఈ ఎన్నికల ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా పద్మారావు, జ్ఞాన ప్రసాద్, 50 మంది ఎన్నికల సిబ్బందితో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఫలితాలు శనివారం అర్ధరాత్రివరకు వెలువడే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల నేపథ్యంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభ్యుల ఎన్నిక అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కౌన్సిల్ సభ్యుడిగా జోగిపేట వాసి


రమేశ్ గుప్తా

జోగిపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టాబ్లిష్‌మెంట్ కౌన్సిల్‌లో జోగిపేటకు చెందిన మెడికల్ వ్యాపారికి చోటు దక్కింది. రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్లపై నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కౌన్సిల్‌లో జోగిపేటకు చెందిన ప్రముఖ మెడికల్ వ్యాపారి యెదిరె రమేశ్‌ను సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పదవీకాలం ఉండే ఈ పోస్టులో తనను నియమించడం పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు రమేశ్ గుప్తా కృతజ్ఞతలు తెలిపారు.

అనర్హుల సభ్యత్వాలను రద్దు చేయండి

సంగారెడ్డి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోఆపరేటీవ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో అనర్హుల సభ్యత్వాలను రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఆ సొసైటీ సభ్యులు కృష్ణమూర్తి, శరణప్ప, అనురాధ, సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీవో ఎలాంటి విచారణ జరపకుండా సొసైటీతో ప్రమేయం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మరో 200 మంది కొత్త సభ్యులను చేర్చి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం శోచనీయమన్నారు.

పెద్దచింతకుంటలో ఉచితవైద్య శిబిరం

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలంలోని పెద్దచింతకుంటలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వీఎస్ఆర్ వీజేఐటీ కళాశాల,ఐకాన్ ఆఫ్ భారత ఫౌండేషన్, క్లోవ్ డెంటల్, అగర్వాల్ ఐ ఆసుపత్రి సహకారంతో నిర్వహించారు. ఈ శిబిరంలో రక్తపోటు, షుగర్, హార్ట్ రేట్, ఈసీజీ, కంటి, దంత తదితర పరీక్షలతో పాటు జనరల్ ఫిజిషియన్, అప్తమాలజిస్టు తదితర స్పెషలిస్టులు కూడా వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో సుమారు వందమంది పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా మాదాస్‌రాణి

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా మాదాస్‌రాణిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ శనివారం నియామకపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా కార్యదర్శి బాలరాజ్, పట్టణ అధ్యక్షులు నీరుడిచంద్రయ్య, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు సర్వే

రామాయంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ధర్మారం గ్రామంలోని రఘుపతి గుట్టకు బీటీ రోడ్డు మంజూరైంది. గుట్టపైన రామాలయం ఉండటంతో భక్తులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సరైన రోడ్డు మార్గం లేదని మెదక్ ఎమ్మెల్యేకు విన్నవించగా రూ.2 కోట్ల పైచిలుకు నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం రోడ్డు నిర్మాణ పనుల కోసం సర్వే చేపట్టారు.


ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



పటాన్‌చెరు డివిజన్ పరిధి పట్టణంలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, డీఎస్పీ ప్రభాకర్


జహీరాబాద్ పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన కేకును కట్‌చేసి పంచుకుంటున్న కాంగ్రెస్‌నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘనంగా జరుపుకున్నాయి. నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేసి సీఎం కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మిఠాయిలు పంచుకుంటూ సంబురాలు జరుపుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. పలు ఆలయాల్లో సీఎం పేరిట ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దూసుకుపోతున్నదని కొనియాడారు.

- న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి)


మనోహరాబాద్ : కాళ్లకల్ బంగారమ్మ ఆలయం వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మహిపాల్‌రెడ్డి


నర్సాపూర్: చిప్పల్‌తుర్తి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

ట్రాక్టర్, బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

చేగుంట నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చేగుంట శివారులోని జీవిక పరిశ్రమ సమీపంలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధిలోని కరీంనగర్ గ్రామానికి చెందిన చాకలి భూమేష్ చేగుంట నుంచి స్వగ్రామం వెళ్తుండగా మార్గ మధ్యలో చేగుంట శివారులోని జీవిక పరిశ్రమ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రహ్మత్‌నగర్‌లో వ్యక్తి అదృశ్యం


ఉమేష్

జహీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. శనివారం జహీరాబాద్ పట్టణ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌రనగర్‌కు చెందిన ఉమేష్ ఈ నెల7న ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. తెలిసినవారి వద్ద, బంధువులను సంప్రదించినా ఫలితం లేకపోయింది. దీంతో తమ్ముడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

అర్ధరాత్రి విలేకరి ఇంటిపై దాడి

అమీన్‌పూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు పరిశీలించేందుకు వెళ్లిన తహసీల్దార్‌తో వార్త సేకరణ కోసం వెళ్లిన ఓ పత్రిక విలేకరి(ఆంధ్రజ్యోతి కాదు)పై కక్ష పెంచుకున్న కొందరు అతడి ఇంటికి వెళ్లి దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఓ పత్రికలో పనిచేసే బోనాలవిఠల్ అనే విలేకరిపై ప్రభుత్వ స్థలంలో కబ్జా చేస్తున్న ఓ కుటుంబ సభ్యులు తెల్లవారు జామున స్థానిక జవహర్‌నగర్‌లోని విఠల్ ఇంటికి వెళ్లారు. తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తూ తలుపులు బద్దలు కొట్టారు. బాధితుడిపై మూకుమ్మడిగా దాడి చేసి దుర్భాషలాడుతూ తీవ్రంగా గాయపరిచారు. పోలీసులకు సమాచారం అందించడంతో నిందితులు పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు జర్నలిస్ట్ సంఘాల నాయకులతో కలిసి శనివారం అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై ఇసుక లారీ బోల్తా


జాతీయ రహదారిపై బోల్తాపడిన ఇసుక లారీ

పుల్‌కల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళ్తున్న ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటన చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామ సమీపంలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. జోగిపేట వైపు నుంచి సంగారెడ్డి వైపునకు వెళ్తున్న టిప్పర్(టీఎస్12యూడీ 8292) వాహనంలో సామర్థ్యానికి మించి ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో సరాఫ్‌పల్లి వద్దకు రాగానే అదుపు తప్పి సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. ఈ ఘటనలో ఏలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కాగా డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకుని ఘటనాస్థలం నుంచి పరారయ్యాడు. ఇసుకను రాత్రి వేళ నిషేధిత ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తుండగా ప్రమాదానికి గురైనట్టు సమాచారం. కాగా సర్వీసు రోడ్డుపై టిప్పర్ వాహనం బోల్తా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సరాఫ్‌పల్లి గ్రామస్థులు తమ ఆలయ నిర్మాణానికి అవసరమంటూ అప్పటికప్పుడు ట్రాక్టర్లలో అక్కడినుంచి ఇసుకను తరలించారు.

పేకాటస్థావరాలపై పోలీసుల మెరుపుదాడులు

- రూ.1.43 లక్షలు, 22 సెల్‌ఫోన్లు స్వాధీనం.. 20మందిపై కేసు

జహీరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని చిన్నహైదరాబాద్, మండలపరిధిలోని సజ్జరావుపేటతండాలో పేకాట స్థావరాలపై పోలీసులు శుక్రవారం వేర్వేరుగా మెరుపుదాడులు చేపట్టి 20 మందిపై కేసు నమోదు చేశారు. దాడిలో సుమారు రూ.1.43 లక్షల నగదు, 22 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం జహీరాబాద్ పట్టణఎస్ఐ వినయ్‌కుమార్, జహీరాబాద్‌రూరల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు జహీరాబాద్ పట్టణంలోని చిన్నహైదరాబాద్‌లో పేకాట స్థావరంపై దాడులు చేయగా వారి వద్ద రూ.40,150నగదు, 4 ద్విచక్రవాహనాలు, 14సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతున్న 11మందిని అరెస్ట్ చేసి కేసునమోదు చేశారు. అలాగే మండలంలోని సజ్జరావుపేట తండాలో పేకాట స్థావరం పోలీసులు నిర్వహించిన దాడిలో రూ.1,03,630 నగదు, 8సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని 9మందిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేశారు.

లేబర్ పాలసీని ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

పుల్‌కల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లేబర్ పాలసీని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని ఏబీ ఇన్ బేవ్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్ (సీబీఎల్) సర్వసభ్య సమావేశం శనివారం పరిశ్రమలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లేబర్ పాలసీ ద్వారా ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న కార్మికుల హక్కులు పూర్తిగా హరించబడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ పాలసీని ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికవర్గ హక్కుల రక్షణకై సీఐటీయూ నిరంతర పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. డిసెంబర్ 7,8,9వ తేదీలలో మెదక్ పట్టణంలో సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు డిసెంబరు 31, 2026 జనవరి 1,2,3,4,వ తేదీలలో విశాఖపట్టణంలో జరిగే సీఐటీయూ అఖిల 18వ మహాసభలను జయప్రదంచేయాలని చుక్క రాములు పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, ఉపాధ్యక్షుడు పీ.బాగారెడ్డి, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావాలి

కోహీర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళా పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని మండల ఐకేపీ ఏపీఎం కుమార్ అన్నారు. శనివారం కోహీర్‌లోని ఐకేపీ కార్యాలయంలో ఆయా గ్రామాల స్వయం సహాయక సంఘాల సభ్యులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఏపీఎం కుమార్ పాల్గొని మాట్లాడారు. ఐకేపీ ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఎజెండా అంశాలపై చర్చించడంతో పాటు సమావేశాలు, పుస్తకాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. కొత్త సంఘాల ఏర్పాటుతో పాటు వృద్ధుల, దివ్యాంగుల, కిశోర బాలికల సంఘాల ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు అమృత, మాలతి ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కబ్జాల నుంచి శంభునికుంటను కాపాడాలి: సీపీఎం

అమీన్‌పూర్, నవంబరు (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ శంభునికుంటను కబ్జాల బారీ నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. అనేక కాలనీల మధ్య ఉన్న శంభునికుంట నిత్యం కబ్జాలతో క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నర్సింహారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చెత్తా చెదారం వేస్తూ పిచ్చిమొక్కలతో ఆనవాళ్లు కోల్పోయిందన్నారు. కబ్జాలపై గతంలో హైడ్రా కమిషనర్ రంగానథ్ సైతం పలుమార్లు శంభునికుంటను పరిశీలించినా ఎలాంటి మార్పురాలేదన్నారు. సగానికి పైగా విస్తీర్ణం ఇప్పటికే కబ్జాలకు గురికాగా మిగతా సగం మురికి కూపంలా మారిందన్నారు. దోమలు, దుర్గంధం వ్యాపిస్తున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో సీపీఎం జిల్లా నాయకులు పాండురంగారెడ్డి, నాయకులు లలిత, సునీత, తదితరులు పాల్గొన్నారు.